పేకమేడనుండి 'టార్పెడో' దాకా

ఇప్పుడేమైనా ఆటలు ఆడి, వినోదరాయణ్ణితో కూడిమాడి, ఘంటలు ఘటికలు వెళ్ళబుచ్చానా, అది కాలహత్య. కాని ఆ రోజుల్లో ఆటలు పాటలు, వినోదాలు వేడుకలు, కాలంలోంచే ఉదయించి, కాలాన్ని బలపరచి, కాలాన్ని చిరాయువుగా జేసే సాధనాలు యని అనుకోండి.

1905 లో నేను నా మొట్టమొదటి పేకమేడ కట్టాను. మా ఊరిలో మా అరుగుమీద, ఆ యేడు అష్టాదశ పురాణ పఠనంతో పాటు చతుర్ముఖ పురాణ కర్మకాండ కూడా విరివిగా సాగుతూ ఉండేది. పదహారు పేకల్తో, ముప్పైయిద్దరు కూడా,- వాళ్ళొక్కొక్కప్పుడు అరుగు క్రింద ప్రాంగణంలో బండి చాపలు పరిపించుకొని, ఊళ్లోని యోధానాం యోధులంతా, తఱుచు అడ్డాట ఆడుతూ వుండేవారు. చిత్తు ముక్కలు తీసివేత ఉంటే, దూరంగా పడేసి నన్ను మేడలూ మిద్దెలూ కట్టుకు ఆడుకోమనే వారు. ఆడుకుంటూ కట్టుకుంటూ, ఉండుండి ఆ పెద్దవాళ్లు పట్టిన పట్లవంక, చేతిలో పెట్టుకున్న ముక్కలవంక, చూసేవాణ్ణి. "ఎందుకురా అలా చూస్తావు?" అని వాళ్ళల్లో ఎవళ్ళన్నా గద్దించారా, "మీ ఆట అయ్యాక పదహారు పేకలతోటి ఎత్తైన మేడ కట్టాలని, మీరు ఆట ఎప్పుడు మానేస్తారా అని" అనేవాణ్ణి.

ఇలా కొన్నాళ్ళదాకా నా వెఱ్ఱివాక్కు విని విని ఆ ముప్పై యిద్దరూ ఒక రోజున "ఏది! కట్టు! పదహారు పేకల్తోటీ నీవొక్క మేడ, ఎంత ఎత్తు కడతావో? ఎంత సేపట్లో కడ తావో!" అన్నారు పందెం చరచినట్టు.

"మీరు పడగొట్టకుండా ఉంటే ఎంత ఎత్తైనా కట్టానన్న మాటే!"

అని వాళ్ళనందర్నీ దూరంగావుండమని, పదహారు పేకలతో పెద్ద ఎత్తైన మేడ కట్టసాగేవాణ్ణి: అయితే దాన్ని పూర్తిగా లేవనివ్వకుండానే, ఆ పెద్ద వాళ్ళల్లో ఎవరో వాకరు వూది, పడగొట్టి వెళ్ళిపోయేవారు. నే నేడుస్తూ అతగాణ్ణి వెను దటిమేలో, బండిచాపలు తీసేసేవారు; పేకముక్కలన్నీ ఎత్తి పేర్చి నా కందకుండా దాచేసేవారు.

ఈలా వుంటూ వుండగా 1905 వేసంగిలో కానోపు, నాకు వడుగైంది. అప్పటికి మా తండ్రిగారు తిరిగి వివాహం చేసి కొన్నారు. భార్యాభర్త లిరువురున్ను పీటలమీద కూర్చునే నాకు సవ్యంగా వడుగుచేశారు! ఆ రోజుల్లో వడుగంటే అదో బ్రహ్మాండమైన ఉత్సవంగా చేస్తూవుండేవారు. ఆ ప్రకారంగానే నాకూ జరిగింది. రాజమహేంద్రవర పాఠశాలకు పంపిన నా సెలవు చీటీలో బహుశా నేను ఆమ్మహోత్సవాన్ని మహా హేతువుగా నిరూపించి "On account of my thread marriage" అని పేర్కొని ఉండివుంటాను. తెనుగు సంస్కృతములను బట్టి ఉపనయనంలో ఉద్వాహమన్న సూచన లేకపోయినా ఇంగ్లీషు వాడుక పదంలో "థ్రేడ్ మారియేజ్" అని వ్రాసి అంతో ఇంతో వివాహ సూచన చిన్నప్పుడే కావింపబడేది. అదే హైందవ సంఘము నందలి అతిబాల్య వివాహాలకు కారణమేమో కూడాను. ఆ వాదం ప్రస్తుతం పక్కకు నెట్టినా వడుగులోని క్రమభావం చిక్కబట్టి చూదాం.

మా తండ్రిగారు నాకు యథాప్రకారంగా నా చెవిలో అతి రహస్యంగా బ్రహ్మోపదేశం గావించారు. బ్రహ్మోపదేశం

అయి బ్రాహ్మాశీర్వాదం పొంది మంగళహారతి అంది, ఇలా యివతల బడ్డాను! అలా ఒకవడుగు కాని కుఱ్ఱకుంక "బ్రహ్మోప దేశం ఎలాగుంది ఏమిటి? అని అతిహేళనగా అడిగాడు.

"పేకమేడలోకి గాలి వూదినట్టుగావుంది" అన్నాను. ఆ జవాబు విని వూరుకోవచ్చునా వాడు? వూరుకోక అడిగాడు "గాలి వూదగానే పేకమేడ కూలిపోయింది. నీవు ఆలాగే వున్నావు పడిపోకుండా!" అని.

నేను అంతకు ముందు నంపిమోహనం వంట అడుదుం బొడుదుం అయినా ఆకలి తీరా తిని, మఱీ పొందాను బ్రహ్మోప దేశం! ఆ పేక గూళ్ళల్లో కూడా మిఠాయి ఉండలు, జిలేబీలు, అవీ యివీ పెట్టి వుంచి వూత్తే పడిపోదను కుంటాను. ఆ మేడ" అని సమాధానం చెప్పాను.

అప్పటినుంచీ వాడూ నేను పేకమేడలు కట్టి, వాడు తిను బండారాలు తేవడం, నేను పెట్టడం చేసేవాళ్ళం. పెడుతూ ఉంటేనే పడిపోయీవి ఆ ముక్కలు! ఇక ఊదేదేమిటి ఆ గూళ్ళ ల్లోకి? ఇద్దరం కూర్చుని ఆ తిను బండారాలన్నీ ఊదేశేవాళ్ళం మా బొజ్జల్లోకి!

అయితే సెలవు లయిపోయి రాజమండ్రి రావడంలో ఆ మహాపట్నంలో చీట్లాటకు తావుండేది కాదు. అక్కడనీ్న నిజం మేడలే కనబడేవి. మఱి తినుబండారాలన్నీ బాదం ఆకుల్లో పెట్టుకు తినేవాళ్ళం మేం కుఱ్ఱవాళ్ళం.

మేము అద్దెకున్న యింట్లో ఒకమూల ఒక పెద్ద బాదం చెట్టు ఉండేది! ఆ చెట్టు ఆకులు అన్నీ వొకేసారి పండి, ఒకే సారి ఎఱ్ఱబారి ఉంటూ, చెట్టంతా పూత పూసిందా అనే వెఱుగు

గొల్పేది. ఆ ఆకులన్నీ రాలేసరికి, అమ్మల పొదిలోంచి పుంఖాను పుంఖంగా పొడ సూపినట్టు చిగురాకు బయలుదేరేది. ఒక్కొక్క బాదంకాయ కొట్టీ కొట్టీ, పప్పు ఇవలకు దొలిచి లాగే సరికి జబ్బలడి పోయేవి. అయినా అదో తినుబండారంగా మాకు లెక్క కాబట్టి కిందపడ్డ కాయనల్లా పగలగొట్టేవాళ్ళం. లోపటి తెల్లటి పప్పు ఆకుల్లో పెట్టుకు తినేవాళ్ళం. ఒక్కొక్కప్పుడు బజార్లో కొనుక్కున్న పసుప్పచ్చటి కారప్పూసా, కారబ్బూందీ కూడా పెట్టుకు తినేవాళ్ళం. ఏమైనా తినే వస్తువు రంగు వేరుగాను, ఉంచుకునే వస్తువు రంగు వేరుగాను కనిపించేది. మఱిన్నీ తినే వస్తువు అంతలో ముక్కు క్రింది గోతిలో పడి మాయమయ్యేది. ఉంచుకునే వస్తువు ఆలా గిరాటు వేయబడి, ఎండిపోయి చెత్తగా తుడిచివేయ బడేది. "ఆకుల్లో ప్రాణం లేదు. ఆకులు చచ్చి పోయాయి" అని కూడా అనుకునేవాళ్ళం, వొక్కొక్కప్పుడు అతి జాలిగా !

ఇలా రాలిపోయిన బాదం ఆకుల మీద నాకు జాలి పారిన ఆ రోజుల్లో దసరా సెలవులొచ్చాయి. తిరిగి మా వూరు వెళ్ళటం తటస్థించింది. అప్పుడు దసరాకు ఊరిలోని పెత్తందార్లు అంతా కూడి అమ్మవారి గుడివద్ద తోలుబొమ్మలాట ఆడించారు. అదే మొదటిసారి నేను అలాంటి ఆట చూడ మొదలు పెట్టింది. ఆ బొమ్మలరంగులు, వొంగులు, తెరనుండి అట్టే ఎడపరచి ఇట్టే గ్రుచ్చేలో చూపించే చెంగులు, వెలుగు దిగ్గ్రమింగులు అన్నీ ప్రత్యక్ష ప్రత్యక్షర సత్య పురాణమై నేత్రపర్వం గావించేవి. ఆడించే మనుష్యుల ప్రాణాలకంటె పెద్ద పెద్ద ప్రాణాలు ఆ బొమ్మల్లో రాత్రివేళ రహించేవా, రాముడై, రావణాసురుడై,

వాలై, కాలనేమై, అని విస్తుపోసాగాను. ఆ విస్మయం విస్మయం దసరా సెలవుల అనంతరం తిరిగి రాజమహేంద్రం చేరుకున్నా నాలో నశించి పోలేదు. బొమ్మలాటవాళ్ళు బొమ్మలకు ప్రాణాలోసినట్టు నేను మాత్రం రాలి పోయిన బాదం ఆకులకు ప్రాణం పోయలేనా అనే ఊహావేశం జనించింది, చెట్టునుండి రాలే ఆకుల్ని చూచినప్పుడల్లా! మఱీన్నీ తోలు బొమ్మల రంగునందు, పండబారిన బాదం ఆకుల రంగునందు ఒకేవిధమైన రమ్యత, సౌమ్యత నాకు గోచరించాయి.

వెంటనే ఈ చేతిలో ఒక పండుబాదం ఆకు, ఆ చేతిలో పదిపండు బాదం ఆకులు నిలువునా నిలబెట్టి ఒక ఆకును రాముడు అంటూ, పది ఆకుల్ని పది తలకాయల రావణాసురుడు అంటూ, రాముని చేత దెబ్బలు కొట్టించి, దెబ్బ దెబ్బకు ఆకు ఆకుగా పెడచేత నున్న పదాకుల్ని జారవిడిచి "చచ్చాడు రావణాసురుడు" యని రామునికి జేజే సమర్పించాను.

"ఒరేవ్! రాలిపడ్డ బాదం ఆకులకు ప్రాణ ప్రతిష్ఠ చేశానురోయి!" అని తోటి కుఱ్ఱణ్ణి హెచ్చరించాను. వాడు తోడ్తో చెట్టెక్కి రాలిపోని ఆకుల్ని కూడా "కపి సైన్యం లంక మీదకు దిగుతోంది చూడు" అని ఒక వంద ఆకుల్ని రాలేశాడు. లోపట్నుంచి మా అమ్మమ్మ వచ్చి మమ్మల్నిద్దర్ని మోది ఆ ఆకు లన్నింటినీ తుడిచి, పెంటపోగుకు జేర్చిందై, "మరి ఆకులతో తోలుబొమ్మలాడారా మీ వొంటి తోలూడిపోగలదు" యని భయపెట్టింది. చేతిలోని చీపిరూపుతూ!

ఆమెకు లొంగుతామా మేం? మర్నా డామె ఆ బాదం చెట్టు కొట్టేయింపించింది ఇంటివాళ్ళ చేతనే. "ఇంటి పెంకులన్నీ

చితికిపోతున్నాయి. వెధవచెట్టు పనికిమాలినచెట్టు" యని చెట్టు మీద చాడీ చెప్పింది మా ముసిలవ్వ.

చెట్టు కొట్టివేసి నప్పట్నుంచి ఆ స్థలం "సువిశాల మిదం విశ్వం" అన్నట్టు మిక్కిలి పఱపై, బట్టబయలై కనబడ సాగింది మాకు! "ఆ స్థలం అంతా ఊరికే పోనివ్వడమేనా?" అనే యిది లోలో రేకెత్తింది. ఆ మా నూతనోత్సాహం పెద్ద వాళ్ళకు తెలియజేయ నివ్వకూడదనుకున్నాం: ఈ కొత్తగా పుట్టిన ఉత్సాహం, లోలోతుల్లోంచి ఉప్పతిల్లింది గాని, పైపైని రేగింది కాదు. ఒకింత "సీరియస్" మొహాలు వేసి యప్పుడప్పుడు ఆలోచనా నిమగ్నులమై అన్యోన్యం అతిదీర్ఘ సంభాషణలు గావించుకునే వాళ్ళం కూడాను, నేనూ నా తోడి ఆటగాండ్రును. వీళ్ళేదో కొంప ముంచేటట్టున్నారు. అని పెద్దవాళ్ళు వాక్కాక్కప్పుడనుకునేవారు.

చెట్టు కొట్టివేయ బడ్డ మొదటనే ఒక చిన్న ఆటగుడారం వేశాము. అందులో, మాలో కొందఱం సింహాలమై, కొందఱం ఏనుగులమై, కొందఱం గుఱ్ఱాలమై, కొందఱం మల్లులమై, కొందఱం అల్లరిగాండ్లమై, వాలుమొగ్గలు, తల్లక్రిందు నడకలు కొమ్మ నిలుపులు, కుస్తీ చఱపులు, ఎన్నెన్నో కోటి ఫీట్లుగా ఆడేవాళ్ళం, ఎక్కడ నేర్చారర్రా ఇవన్నీ యని పెద్దవాళ్ళు అడిగితే, "మీరు అప్పుడే చూడకూడదు. టిక్కెట్లు పెట్టి ముందు ముందు ఆడతాం! అప్పుడు రావాలి" యని వెంట వెంటనే వాళ్లు చూచేలాగు మల్లుమొగ్గలు పిల్లిమొగ్గలు వేసేసే వాళ్ళం. వాళ్లు "భడవల్లారా! పెద్ద సర్కస్‌కంపెనీ లేవ తీశారే!" యని మా రహస్యం కనిపెట్టేసి కట్టుకట్టేసి వెళ్ళి పోయేవారు.

పెద్దవాళ్ళనుకొన్న దానిలో నిజం లేకపోలేదు. ఆసంవత్స రం దీపావళీ ప్రాంతమందు వచ్చి వెళ్ళిపోయాయి కొన్ని కొన్ని పెద్ద పెద్ద సర్కసు కంపెనీలు. వీనుమిగిలిన "మేనా జరీలతో" మేనేజర్ల'తో "ఛత్రిస్" యని "కోడిస్" యని ఏవేవో. అయితే వాటిని చూచి మేమీ ఆటలు ఆడేము యని వొప్పుకునేవాళ్ళం కాము. అదంతా మా సొంత నేర్పు, మా వింత సృష్టి, మా శరీర సౌష్ఠవం యని విఱగబడి పొయ్యేవాళ్ళం. ఎంత వెలుగ బడినన్నీ, ఒకానొక ఎఱుకలేకపోవడంవల్ల, చివరకా ఉద్యమం విరమించేశాం! ఏమిటి అంటారా ఆ ఎరుక?- పెద్ద పెద్ద కొరడాలుచ్చుకు టప టపా పేలించడం మాకు సాధ్య మయ్యేది కాదు మఱీన్నీ "ఎడ్వర్టయిజుమెంటు పోస్టర్లు" అంటే, ప్రచురణ లేక ప్రచార పత్రాలు, పటాలు, ఏనాడు వీధి గోడలకు గతుక్కుని మమ్మల్ని లోకానికి వెల్లడి చేస్తాయో బోధపడేది కాదు. అది దానంతటదే దేవతల వల్లనో మహాత్ముల వల్లనో జరుగవలసింది కాని, మానవుల వల్ల జరుగ గలిగేది కాదని మా నిశ్చితాభిప్రాయం. ఏమా అంటే ఆ రోజుల్లో రెండో కంటివాడు చూడకుండా అంత రహస్యంగా ప్రకటించబడేవి వీధి గోడల మీద బొమ్మలూ, బొద్దక్షరాలూ, సమస్త ప్రకటనలూను.

అయితే యోజించగా, యోజించగామాలో లోపం కూడా కొంత కనిపించేది. పెద్దపెద్ద కొరడాలు టప్‌టప్ మనిపించాలంటే, మిక్కిలి పొడుగ్గా ఉండాలి. వొకానొక మనిషి, ఎత్తుగా గోడల మీద ఇతరులు చింపెయ్యకుండా చీటీ లంటించాలీ యంటే, అంతకంటె ప్రాంశులై ఉండాలి ఒకానొక వ్యక్తి. మేం చూదొస్తే భూమి? జానెడెత్తైనా కనిపించే వాళ్ళం కాం.

అందులోనూ నేను 1905 లో నేలములగచెట్టుకు నిచ్చెన వేసే సామెత కొలతకు వచ్చేవాణ్ణి! కాని నడుము పేలవం కావడం వల్ల నిలువునా వెనక్కువాలి, వాలుమొగ్గ వేసేసేవాణ్ణి! ఎంత ఘనుణ్ణి అయితేం ఏతదుద్యమవిరమణంతో పాటు నా వాలు మొగ్గలకున్నూ నేను స్వస్తి చెప్పేసెయ్యవలసి వచ్చింది!

అప్పటినుంచి పొడుగుపాటి మనుష్యులను చూస్తే నాకదో విధమైన కసి, కావేషీ ఎత్తేది. "వాళ్ళను నేలకు పడగొట్టి నేను నింగి చూతును గాక!" యని నిత్యం భగవంతుణ్ణి ప్రార్థన చేసేవాణ్ణి. ముఖ్యంగా ఆర్య సాంప్రదాయంగా తూర్పుకు తిరిగి "ప్రత్యూష పవనాంకురములకు" నా జునపాలాడేలా సూర్యోపాసన గావించే వాణ్ణి. అప్పట్లో నాకు జునపాలు, జుత్తుముడి అవీ ఉండేవి. నాకేకాదు. ఆంధ్రులలో పెక్కురకుండేది. ఈలా సూర్యోపాసన చేయగా చేయగా నాకు కనిపించింది నరుడు గాదు, అమరుడూ కాదు. ఒకానొక దేశం ఒకానొకనాడు కన పడింది. ఇంగ్లీషులో దాన్ని "Land of the Rising sun" అన్నాను. ఆ దేశం పుస్తకాలలో వుందా యని వెతికితే "జపాన్" గా తేలింది. దాని విషయమై ఇంకా తర్జన భర్జనం చేయగా "జపానీయులు మిక్కిలి పొట్టివాళ్లు యని, పొడుగు వాళ్ళయిన రష్యా వాళ్ళను ఓడించి బుద్ధి చెప్పారు యని, ఆ జరిగింది ఆ యేడేనని అనగా 1905 లో నేనని గమనించ గలిగాను.

"అంత పొట్టివాళ్లు అంత పొడుగువాళ్ళను, జయించారా?" అని వాళ్ళ సాధనాలు, ప్రక్రియలు పరామర్శింప దొడగొన్నాను. ఒకటి "జుయిజుట్సు" రెండు "టార్పెడోస్" అని తేలింది.

" జుయిజుట్సు " లో ఎదరమనిషి కాల్లోకాలెట్టి పడగొట్టాలిట. అదోకు స్త్రీ పట్టులోని కిటుకు, మెళుకవానట! ఎంత పొడగరైనా ఈ పొట్టివాడలా మెటకరించే సరికి, అమాంతంగా తలదేఖీలతో పాటు భూతలం అంటి చిత్తుగావడమేనట! ఎదర ఎత్తరి! అది నావల్ల కాదని వెంటనే తేల్చేసుకున్నాను. రెండు మూడు తడవలు పొడుగ్గానడిచే మా మాతామహుని కాళ్ళ కడ్డడ్డాలకి చూచాను పడతాడేమో యని, కాని ఆయన ముందు నేనే ఎప్పుడూ పడిపోయేవాణ్ణి. ఏమిట్రా అది అంటే సాష్టాంగమనే వాణ్ణి. నా ముందు ఆయనెప్పుడూ పడ్డదిలేదు. ఇంటిలోనే గెలవ లేప్పుడు వీధిలోనా గెల్చేది యని జుయిజుట్సు గొడవ వదిలేసి టార్పెడో నిర్మాణానికి సంకల్పించాను.

ఇది చాటుగా నీళ్ళ మాటుగా సముద్రంలోకి పోయి శత్రువులయొక్క పెద్ద ఓడక్రింద " ఢాం " మని పేలి ఓడ నంతనూ పేడుగా పొడరుగా చేసివేసి ఉగ్గురంగరించినట్టు సముద్రం బొంగరించి పారేయగలదట! కాబట్టి టార్పెడో ఢాం మనిపించానా నేను జపాన్ వీరుణ్ణి అయ్యాయనన్నమాట. ఇదీ ఆ సంవత్సరపు కడసారి సంకల్పం నాలో విజృంభించినటువంటిది. కాని సముద్రం సృష్టించటం ఎట్లా? అవతల ఓ పెద్ద వోడ ఎవరిదని ఎదరనిల్పను? నేను ఆ టార్పెడో పేల్తే బ్రతుకు తానా? నాకే మోసం వస్తుందేమో? " ఇవో కొన్ని కొత్త సమస్యలు చిత్తం కలవరపర్చసాగాయి. కాబట్టి అవివేకంగా ప్రయోగముకు వెంటనే బొఅబడకుండా నిదానం వహించి " టార్పెడో " ని గురించి విజ్ఞానం ఇంకా సంపాదించసాగాను. టార్పెడో ప్రయోగముకు కావలసింది సాహసం గుటి యని

ద్వివిభాగాలుగా తేల్చాను. రెండింటినీ సమీకరణం చేయడం కూడా ఎట్టకేలకు జరిగింది, గుటివుంటే సాహసం అదే జతపడు తుంది యనే నావూహ.

ఈ ప్రకారంగా గుటి, సాహసం రెండింటినీ సమన్వయం గావించుకుని, ఓనాడు పంచేసాను ?—కాలి బొటనవ్రేలికీ, దాని పక్క వేలికీ మధ్యను ఒక చిన్న రాయినెత్తిపట్టి యతి సూటిగా, అపరసంజవేళ, ముటి ముటి యిరులప్పుడు టపీ మని దేన్నో పొడుగైనదాన్ని తగలాలి ఇది యని ఆరాతి కెక్కడ లేని "మొమెంటమ్" ఇచ్చాను. వెంటనే అది వెళ్ళి ఎత్తైన మునిసిపల్ లాంతరు స్తంభం చివరనున్న లాంతరు అద్దాన్ని పగులగొట్టింది.

"ఏలాగయ్యా! దీపం వుండేది?" వెనుకనుంచి ఎవడో కేక! ఎవడేమిటి? పెద్ద నిచ్చెన. నిషూ గుడ్డపాగావాడూ మునిసిపల్ దీపాలు వెలిగించే ముసలి చాకలి! నా ప్రాణాలు నాలో లేవు! నేను గానట్టుగా గభీమని, పక్కనేవుండేమో మేం కాపురం వున్న యిల్లు, ఆ యింటిలోకిదూరి తలుపు గెడ పెట్టే శాను. ఇప్పుడా వీధిని రాయి విసిరానా ఆ రాయివెళ్ళి పెద్ద పెద్ద షాహుకార్లు కట్టుకున్న ఆకాశపు టెత్తు అద్దాల మేడల తలుపుల్ని తగుల గలదు. ఆ రోజులలో కాబట్టి సరిపోయింది. ఆ కుటుచ వసారాల యిల్లు కాబట్టి నాకు దాక్కో తలుపు తెఱచి, తలుపు వేసుకుంది. నన్ను తన సందుగుండా ఎంతో బుద్ధిమంతునిగా లోకానికి చూపింది!

....